
# వి. విజయలక్ష్మి

# ఉల్లిపాయ



"ఈ ప్రపంచంలో అన్నిటికన్నా అందమైన పక్షి ఏది?" అని క్లాసులో టీచర్ అడిగినపుడు, లేచి నిలబడి "కాకి" అన్నాను.

క్లాసంతా ఘొల్లుమంది. ఇది జరిగి పది సంవత్సరాలైనా నాకు బాగా గుర్తు. ఇప్పటికీ నా అభిప్రాయం లో మార్పు లేదు. కాకి — కాకి లాగే కనబడి, కాకిలాగే ప్రవర్తిస్తుంది. లోకులు కాకులు అంటారు కానీ, కాదు.

లోకులు డేగలు. కోడిపెట్టల్ని చంపే డేగలు. లోకులు నెమళ్ళు. తమ అందాన్ని చూసి తామే మురిసిపోతారు.

ఇంకో విషయం కూడా వుంది. ఎక్కువ వున్నాయి కాబట్టి కాకుల విలువ తెలియటం లేదుగానీ, ఒకటి రెండు కాకులు మాత్రమే వుండి, వాటిని జూపార్కులో పెడితే "ఆహా. ఎంత అందంగా వున్నాయో — ఆ కళ్ళెంత అందంగా మెరిసిపోతున్నాయో" అనుకోమూ.

మనుష్యులకి కూడా ఇది వర్తిస్తుందేమో అనుకుంటాను. అందమంటే శరీరంతోపాటు మనసుకి కూడా మార్కులు వేయాలి కదా. కానీ మనసుని శోధించాలంటే అది చాలా శ్రమ, కాలంతో కూడిన పని.

[illegible] అందం గానీ, చదువు, తెలివితేటలు, డబ్బు వుంటే, వాళ్ళు నెమళ్ళ జాతి [illegible]. మిగతా జనం వీళ్ళ కంపెనీ, స్నేహం కోరుకుంటారు. నెమలి శరీరంలో కాకి మనసు [illegible] అనుకోరు. అంత [illegible] ఓపిక కూడా.

ఎందుకంటే — మానవ సంబంధాలన్నీ ఉల్లిపాయ లాటివి కాబట్టి.

* * *

థామస్‌ని నేను మొదటి చూపులోనే ఇష్టపడ్డాను. అతడికి అందం, డబ్బుతోపాటు చదువుకూడా వుంది. పైగా టేబిల్ టెన్నిస్ కూడా బాగా ఆడేవాడు. ఈ నాలుగిట్లో రెండు చాలనుకుంటాను -- అమ్మాయిలు అతని స్నేహంకోసం ఆరురులు సాచటానికి! ఇందులో సిగ్గేముంది చెప్పుకోవటానికి? నేను కూడా అతని 'కంపెనీ' అంటే ఇష్టపడేదాన్ని, అతను కూడా మాపట్ల ఏ విధమైన చొరవ తీసుకునే వాడు కాదు. అమ్మాయి లందరూ ఒకరిపట్ల ఒకరం మనసులో అసూయపడుతూనే, అతని కంపెనీలో గుంపులు గుంపులుగా వుండటానికి ప్రయత్నించే వాళ్ళం. చాలామంచి స్నేహితులుగా, స్వచ్ఛమైన మనసుతో వుండేవాళ్ళం.

ఆ సమయంలోనే మానవ సంబంధాలగురించి సుసాన్ స్మిత్ వ్రాసిన పుస్తకం ఒకటి

## పోటీలో మొదటి బహుమతి పొందిన కథ



చదివాను. బియ్యేలో సోషియాలజీ మాది. చివరి సంవత్సరం చదువుతున్నాను.

ఆ పుస్తకం చదవగానే నా మెదడు పొరలు విచ్చుకున్నట్టు అనిపించింది. సాహిత్యానికి సామాజికపరమైన బాధ్యత ఎంత వుందో నాకు తెలీదు గానీ, చదివే వారి వ్యక్తిత్వం మీద దాని ప్రభావం చూపించకపోతే అది వృథా.

సుసాన్ స్మిత్ వ్రాసిన ఒక వాక్యం నన్ను అమితంగా ఆకట్టుకుంది. 'ఒకమ్మాయికీ, ఒక బ్బాయికీ మధ్య స్నేహం వున్నప్పుడు, ఆ అమ్మాయికి మరో అబ్బాయితో కూడా ఇలాటి స్నేహమే వుందని తెలిసి, ఆ మొదటి అమ్మాయి ఏ విధమైన ఈర్ష్య పడకపోతే, అది స్వచ్ఛమైన స్నేహం' అట!

[illegible] [illegible] ఎరిగే మా అందరిదీ స్వచ్ఛమైన స్నేహం కాదని ఎప్పుడయితే నాకు స్పృహ కలిగిందో, నేను ఆ వలయంనుంచి బయటకొచ్చాను. దాంతో నాకు సోషియాలజీ మీద మరిన్ని పుస్తకాలు చదివే వీలు కలిగింది.

ఒక రోజు క్లాసులో నన్ను లెక్చరర్ 'మానవ సంబంధాల గురించి ఒక ఉదాహరణ చెప్ప'మన్నారు. నాకు ఆ [illegible] మీద పుష్ప పుత్సాహం

ఆమెకు తెలుసు. "మానవ సంబంధాలన్నీ ఉల్లిపాయలాటివి" అన్నాను లేచి నిలబడి.

పదిహేను సంవత్సరాల క్రితం లాగే క్లాసంతా ఘొల్లుమంది. నా మీదున్న గౌరవంతో లెక్చరర్, తాను నవ్వకుండా, "ఎందుకలా అనుకుంటున్నావు?" అంది. నేను గొంతు సవరించుకుని అన్నాను. "ఇద్దరు కాలేజీ అమ్మాయిలు సినిమాల కెళ్తూ, వీళ్ళింట్లోనో, వాళ్ళింట్లోనో గంటల తరబడి గడుపుతూ తమది గాఢమైన స్నేహం అనుకుంటారు. ఒక ఇల్లాలు వెలాఖర్లో తనకి చేబదుళ్ళిచ్చే పక్కింటి పిన్నిగారు చాలా గొప్ప వ్యక్తి అనుకుంటుంది. ఒక పార్టీలో కలుసుకునే యువకులు తాము స్నేహితులుగా సాయంత్రాన్ని ఎంజాయ్ చేస్తారు. మోర్నింగ్ వాక్‌కి వెళ్ళే వృద్ధులు తమది మంచి కంపెనీ అనుకుంటారు. ఈ రకంగా మనుష్యులందరూ నిరపాయకరమైన... తమని ఇబ్బంది పెట్టని సంబంధాల్లోనే జీవిస్తారు. సమస్యని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు మనిషి పొరలు తొలగిపోతాయి. పొరలు తొలిగే కొద్దీ స్నేహపు సాంద్రత తగ్గిపోతుంది. అందుకే భార్యాభర్తలు చాలామంది మంచి స్నేహితులు కాలేరు..." ఆగి అన్నాను. "మానవ సంబంధాలన్నీ ఉల్లిపాయ లాటివి. బంగారు రంగులో మెరిసే తొక్క పైనుంటేనే అవి బాగుంటాయి... లేకపోతే కన్నీళ్ళు తెప్పిస్తాయి" అన్నాను. క్లాసంతా మౌనంగా వుండిపోయింది. ఇప్పుడెవరూ నవ్వటం లేదు. లెక్చరర్ అభినందిస్తున్నట్టు చూసింది.

ఆ సాయంత్రం థామస్‌నుంచి నాకు ప్రేమ లేఖ వచ్చింది.

* * *

"నీ సెంటిమెంట్ ఏమిటో నాకు అర్థం కావటం లేదు" అన్నాడు థామస్ కారు డ్రయివ్ చేస్తూ. నేను నవ్వి అతడి భుజం మీద తలవాల్చి, "నువ్వు గుర్తించావుకదా. అది చాలు" అన్నాను. హనీమూన్‌కి గోవా వెళ్తున్నాం. వెళ్ళేముందు భద్రాద్రి రాముణ్ణి చూడాలని పట్టుబట్టాను. అదీ గొడవ.

పది అడుగుల దూరంలో ఏముందో కూడా కనబడకుండా చీకటి — వర్షం. కారు అద్దాలన్నీ పైకి ఎత్తేసినా, బయట గాలి హోరు లోపలికి వినబడుతుంది. థామస్ చాలా జాగ్రత్తగా డ్రయివు చేస్తున్నాడు.

థామస్ — మేము గోవాలో గడపబోయే హనీమూన్ గురించి వర్ణిస్తున్నాడు. చాలా ఎగ్జయిటింగ్‌గా వున్నాడు.

...థామస్ నుంచి ప్రేమ లేఖ వచ్చాక మా స్నేహం గట్టిపడింది. ఎమ్మే చదవటానికి ఇద్దరం వాల్తేరు వెళ్ళాం. రామకృష్ణా బీచ్‌లో ఎన్నో సాయంత్రాలు సముద్రం పక్కనే కూర్చుని కబుర్లు చెప్పుకునే వాళ్ళం. అతడు నాకు ప్రేమ లేఖ ఎందుకు వ్రాసిందీ కూడా చెప్పాడు. నేను ఆ సర్కిల్‌లోంచి బయటకు రావడం తను గమనించాడట. కారణం మాత్రం తెలియలేదట. అప్పటికే నేనంటే బాగా అభిమానం వుండటంతో నా వెలితి బాగా ఫీలవుతూ, అప్పుడే తెలుసుకున్నాడట — తను నన్ను ప్రేమిస్తున్నాడని!

నేను చాలా గర్వంగా ఫీలయ్యాను. మా ప్రేమ విషయం తెలిసి మిగతా అమ్మాయిలు దూరం వెళ్ళిపోయారు. మేమిద్దరం ఒకర్నొకరం "బాగా అర్థం చేసుకున్నాక" మా ఇంట్లో అతన్ని పరిచయం చేసాను. థామస్ తండ్రి మా వాళ్ళకి తెలుసట. మా వాళ్ళకి అభ్యంతరం లేకపోయింది. మతం వేరయినా, మా నాన్నగారి హోదా, డబ్బు — థామస్ తల్లిదండ్రులని కూడా నొప్పించింది అనుకుంటాను. మొత్తం మీద ఏ అవాంతరమూ లేకుండా వప్పందం జరిగిపోయింది. ఆ తరువాత ఇద్దరం ఎమ్మే చదవటానికి వైజాగ్ వెళ్ళాం.

ఆ రెండు సంవత్సరాలూ నా జీవితపు అతి సంతోషకరమైన దినాలు. థామస్ నిజంగా హి—మాన్! నేను సముద్రాన్ని చూస్తూ కూర్చుంటే అతను నన్ను చూస్తూ కూర్చునేవాడు. నా స్పర్శకోసం అర్రులు సాచేవాడు. కానీ, వివాహం జరిగేవరకూ దూరంగానే వున్నాం ఇద్దరం. మనసులు కలిసాక చిటికెన వేలు ముట్టుకుంటే ఏదో అవుతుందని కాదుగానీ, పెళ్ళయ్యేవరకూ ఆ అపురూపమైన అనుభూతిని దాచుకోవాలని నా వుద్దేశ్యం. థాయస్ ఎన్నో కబుర్లు చెప్పేవాడు. ప్రతిరోజూ సాయంకాలం కోసం ఎదురు చూసేదాన్ని. మమ్మల్ని 'బెస్ట్ పెయిర్' అనేవాళ్ళు. ఆ వేసవిలో మా వివాహం జరిగింది.

హనీమూన్ వెళ్ళేముందు భద్రాచలం వెళ్ళాలన్న నా నిర్ణయాన్ని విని థామస్ ఆశ్చర్యపోయాడు. కాస్త విసుగ్గా "నీకు మతిపోయింది" అన్నాడు.



## గొడవ?

"వాషింగ్ మెషిన్ కొనాలా వద్దా అని నిన్న నాకూ మా ఆయనకూ చిన్న గొడవైంది" అంది పద్మ, రమతో.

"ఆ తర్వాత?"

"చివరికి పోనీలే అని కొనిచ్చాను" చెప్పింది పద్మ.


—పద్మశ్రీ (మాణిక్యారం)




ద్వారైస్వామి

కాశ్మీర్ ఉగ్రవాదులు బందీగా పట్టుకుపోయిన కె.ద్వారైస్వామి టి.వి.యాడ్‌ఫిల్మ్ స్టారైపోయినాడు. టాటా ఆయిల్ మిల్స్‌వారి 'ఆల్ట్రాడబుల్' బట్టల సబ్బు బిళ్ళ ప్రచారంకోసం ఎంచుకోబడ్డ ద్వారైస్వామికి ఉగ్రవాదుల పుణ్యమాని విశేష ప్రచారం లభించింది. అదే కావాలంటూ యాడ్ ఏజెన్సీవారు స్వామికి గ్లామర్ జోడీ చేశారు.

—(పాతూరి





ముద్దు

"నేను చెప్పిన దానికి నువ్వు ఒప్పుకోకపోతే వెంటనే నిన్ను ముద్దెట్టేసుకుంటాను పద్మా."

"ఊహు.. అందుకు నేనొప్పుకోను శ్రీనూ" చటుక్కున అంది పద్మ.

—పద్మశ్రీ (మాణిక్యారం)

నేను నవ్వి "మన జీవితాల్లో ఆనందం ఇచ్చే సంఘటనల్నన్నీ మతి లేకుండా చేసేవే. ఎక్కడైతే స్పృహ వుంటుందో అక్కడ ఆనందం వుండదు" అన్నాను. థామస్‌కూడా నవ్వేసి 'సిల్లీగర్ల్' అన్నాడు.

ఫలితమే ఈ ప్రయాణం.

వర్షం మరింత ఎక్కువైంది. ఉన్నట్టుండి థామస్ కారు పక్కకి తీసి ఆపుచేశాడు. నన్ను డ్రయివు చెయ్యమంటున్నాడేమో అనుకుని కళ్ళు విప్పి, అతడి భుజం మీదనుంచి తలతీశాను. రోడ్డుకి ఎదురుగా అన్నీ నీళ్ళు. ఎక్కడో కట్ట తెగినట్టు — అంతా జలమయంగా వుంది. నాకెందుకో భయం వేసింది. నీరు మా వైపుకే వస్తోంది. ఆ నీటిలోకి కారు తీసుకెళ్ళటం రిస్క్. పావుగంట అలాగే కార్లో కూర్చున్నాం.

థామస్ తరువాత కారు వెనక్కి తిప్పి పోనివ్వసాగాడు. అతడిని ఆ క్షణం మాట్లాడిస్తే తిడతాడని వూరుకున్నాను.

"ఇటు రాకపోతే ఈ పాటికి గోవాలో వుండేవాళ్ళం" అన్నాడు. నేను మాట్లాడలేదు. ఇంత దూరం వచ్చి వెనక్కి వెళ్ళవలసి రావటం నాకు బాధగానే వుంది. కానీ ఎలా వెళ్ళగలం? ఈపాటికి భద్రాచలం సగం మునిగివుంటుంది.

"ఇలాంటి ప్రయాణాలు వర్షాకాలంలో పెట్టుకోకూడదు. వేసవికాలం అయితే బావుంటుంది" అన్నాడు.

"అసలు పెళ్ళిళ్ళు వర్షాకాలంలో పెట్టుకోకూడదు. శీతాకాలం అయితే బావుంటుంది" అన్నాను. వాతావరణాన్ని తేలిక చేయటం కోసం! థామస్ నవ్వి, నన్ను దగ్గిరకు తీసుకుని పెదవుల మీద గాఢంగా ముద్దుపెట్టుకుంటూ, ఎందుకో తలతప్పి రోడ్డువైపు చూసి, సడెన్ బ్రేక్ వేశాడు.

అటు కూడా నీళ్ళు!! పాము జరజరా పాకినట్టు రోడ్డుకడ్డంగా వెళ్తున్నాయి. "డామిట్" అంటూ థామస్ తనలో విసుక్కున్నాడు. మేము చూస్తూ వుండగానే నీళ్ళు చక్రాల్ని ముంచేవరకూ వచ్చాయి. అలాగే రివర్స్ చేసుకుంటూ వెనక్కి ప్రయాణం చేసాం. కొంతదూరం వెళ్ళేసరికి రోడ్డు మునిగిపోయింది. దూరంగా విశాలమైన మైదానం. అంతా నీళ్ళు. ఏది గోదావరో, ఏది రోడ్డో తెలియనంతగా నీళ్ళు, క్షణక్షణానికీ నీటిమట్టం పెరుగుతోంది. థామస్ అలాగే కారుని పక్కగా కోసి, ఎడమవైపుకి తిప్పాడు. అటు రోడ్డు కాస్త ఎత్తుగా ఒక గుట్టమీదకి దారితీస్తుంది. ఆ గుట్టవరకూ వెళ్ళేక వెనుక మరో పెద్ద గుట్టలాటిది కనపడింది.

ఆ గుట్ట మీద ఇంట్లో ఒక చిన్న దీపం వెలుగుతోంది.

* * *

ఆ వృద్ధుడ్ని చూడగానే నాకు గన్స్ ఆఫ్ నవరోన్ సినిమాలో ఆంథోనీ క్విన్ గుర్తొచ్చాడు తెల్లటి గెడ్డం. తైల సంస్కారం లేని జుట్టు. గాజు కళ్ళు...

అంత వర్షపు చీకట్లో మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయినా, లోపలికి ఆహ్వానించాడు.

చాలా చిన్న గది అది. కారుగ్యారేజీలా వుంది. ఒక మూల చెక్క అల్మరా. కుక్కి మంచం. చుట్టూ గోడలు లేవు. పైన కూడా రేకులే అవటంతో వర్షపు చినుకులు మా హృదయం మీద దేనితోనో కొడుతున్నట్టు శబ్దం చేస్తూ జారిపోతున్నాయి. ఆ గదంతా వర్షపు వాసనతో ఇబ్బందిగా వుంది. కారు క్రింద ఆపుచేసి గుట్టపైకి ఎక్కిరావటంతో పూర్తిగా తడిచిపోయాం ఇద్దరం. అతడు మాకు తల తుడుచుకోవటానికి ఒక గుడ్డ ఇచ్చాడు. పాత కార్లు తుడిచే గుడ్డలా వుంది అది. థామస్ దాన్ని ముట్టుకోవటానికి కూడా ఇష్టపడలేదు. అలాగే కూర్చున్నాడు.


"ఏవూరు వెళ్ళాలి బాబూ?" అని అడిగాడు.

"భద్రాచలం"

"మరిటు వచ్చారేమిటి?"

—ఆ వృద్ధుడి మాటల్లో తేలిందేమిటంటే, మేము రెండు కిలోమీటర్లు తప్పుదార్లో వచ్చాం. అటు వెళ్ళినా చేరుకోలేకపోయే వాళ్ళమేమో — అది వేరే సంగతి! ఆ షెడ్డులో ఒక మూల పంటలకి కొట్టే మందు డబ్బాలు వుండటంతో కడుపులో తిప్పుతోంది. ఇప్పట్లో వర్షం తగ్గే సూచన్లు లేవు.

నేను తలెత్తి కిటికీలోంచి బయటికి చూడటానికి ప్రయత్నించాను. కన్ను పొడుచుకున్నా కనపడని చీకటి. అంతలో నిముషంపాటూ, ఆగకుండా మెరిసింది. ఆ మెరుపు వెలుగులో చూసిన దృశ్యానికి నా గుండె ఒక్క క్షణం ఆగి






## డాక్టర్ జయలలిత

అన్ని విదేశాలలో ఈ వింత ఆచారం వుందో లేదో తెలియదుకానీ మన దేశంలో మాత్రం నాయకులైనవారికి 'డాక్టరేట్' ఇచ్చే 'కాకా' సాంప్రదాయం గర్హనీయమైనది.

మద్రాసు విశ్వవిద్యాలయంవారు ఇటీవల జయలలితకు (ముఖ్యమంత్రి అయిన తర్వాత) డాక్టరేట్ ఇచ్చి, బ్యూరోక్రాట్‌లు తమ ఘనతకు 'సిల్వర్‌లైనింగ్' ఇచ్చుకున్నారు.

—ప్రసూరి

కొట్టుకోవడం ప్రారంభించింది. కారు వరకూ నీళ్ళు వచ్చేసేయి. ఒకవేళ వర్షం తగ్గినా మేము ఇప్పట్లో వెళ్ళటం దాదాపు అసంభవం.

నా వెనుక నుంచి ఆ దృశ్యాన్ని చూసిన థామస్ కూడా ఆ విషయం గుర్తించినట్టున్నాడు

"ఈ రాత్రి ఇక్కడే వుండిపోవాల్సి వచ్చేట్టా వుంది" అన్నాడు.

వృద్ధుడు కల్పించుకుని "గోదారి అంతే బాబూ. గంటల్లో పెరుగుద్ది. తగ్గటం కూడా అంతే" అన్నాడు. నేను థామస్‌ని కూర్చోమన్నట్టు సైగచేశాను. 'ఈ మంచం మీదా?' అన్నట్టు నావైపు చూశాడు. నేనింక రెట్టించలేదు.

"కొంచెం టీ పెట్టి ఇత్తునా" అన్నాడు వృద్ధుడు. అతని పేరు రామయ్యని చెప్పాడు.

"వొద్దు. వొద్దు" కంగారుగా అన్నాడు థామస్. అక్కడున్న పాత్రల్ని చూసి అని వుంటాడు బహుశా... నాకాక్షణం వేడి టీ తాగాలనిపించింది. బాగా ఆకలిగా వుంది కూడా. అప్పుడే, నాకు గుర్తొచ్చింది — కార్లో బిస్కట్లు, ఫ్లాస్కులో టీ వున్నాయని. థామస్‌తో ఆ విషయమే చెప్పాను.

"ఇప్పుడెవరెళ్ళి తీసుకొస్తారు?" మొహం చిట్లించి అడిగాడు.

"నేతెత్తునా?" రామయ్య లేచాడు. వొద్దన్నాడు థామస్.

"నాకు కారు తలుపు తెరవటం తెలుసు బాబూ" అన్నాడు అతను. నేను చివాలున తలెత్తాను. థామస్ మరింత ఇబ్బంది పడి "పట్టులే. వర్షంగా వుంది కదా" అన్నాడు. నేను లేచి, "రాత్రి లోపులో వాటి అవసరం ఎలానూ పడుతుంది. తడిసి వున్నాం కాబట్టి ఇప్పుడే వెళ్ళి తెచ్చుకుంటే మంచిది" అని తాళాలు తీసుకుని బయటకొచ్చాను. రామయ్య కూడా నాతో వచ్చాడు. బయట గాలీ, వర్షం శరీరాన్ని వణికించేస్తుంది. ఇద్దరం దాదాపు పరుగెత్తుకుంటూ వెళ్ళి కార్లోంచి కావలసినవి తెచ్చుకున్నాం.

మేము వచ్చేసరికి థామస్ మంచం మీద కూర్చుని వున్నాడు.

* * *

రామయ్య క్రింద పడుకున్నాడు. నేను మంచం మీద. థామస్ ఆ రాత్రి నిద్రపోనన్నాడు. రెండే దుప్పట్లున్నాయి. థామస్‌కి వాటి మీద పడుకోవటం ఇష్టం లేదు.

పది నిముషాలు గడిచేసరికి రామయ్య ఊపిరి తీస్తున్నప్పుడల్లా అదోలాటి శబ్దం వచ్చి, క్రమంగా ఎక్కువైంది. మరో రెండు నిమిషాలు గడిచేసరికి రామయ్య లేచి కూర్చుని ఆయాసపడసాగాడు. అతడికి ఉబ్బసం అని అర్థమైంది.

థామస్ నాతో ఇంగ్లీషులో "ఈ రాత్రి ఇంత దరిద్రంగా గడుస్తుందని నేను అనుకోలేదు. మన పెళ్ళి అయిన నాలుగో రోజు..." అన్నాడు. నేనేం మాట్లాడను? ఏం మాట్లాడినా, మొత్తం తప్పంతా నా మీద తోసేసి తిట్టేట్టూ వుంది అతని మూడ్. అందుకనే నేను మాట్లాడలేదు. అతను మళ్ళీ ఇంగ్లీషులోనే "ఈ ముసలాడు రాత్రంతా దగ్గుతూ మనల్ని చంపేట్టూ వున్నాడు. ఈ అస్థమా పిల్లి కూతలంటే భలేల చిరాకు నాకు" అన్నాడు. రామయ్యకి మేము మాట్లాడుతున్నది అర్థం కాలేదు. అంతలో మరింత పెద్ద దగ్గు తెర వచ్చింది. నేను నీళ్ళు తీసుకెళ్ళి ఇచ్చాను.

రామయ్య లేచి "ఈ దగ్గు తగ్గదమ్మా. నేను బయట పడుకుంటాను" అన్నాడు. పాముకాటు తగిలిన దానిలా నేను "ఏమిటి" అన్నాను ఉలిక్కిపడి.

"బయట ఇంకో చిన్న గది వుంది. అక్కడ పడుకుంటాను" అని లేచాడు. నేనేదో అనబోతుంటే థామస్ లేచి "మాద్దాం పద రామయ్యా" అంటూ తీసుకెళ్ళాడు. ఆ నిశ్శబ్దంలో రెండు మూడు నిమిషాలు కూర్చున్నాను. థామస్ వచ్చి తలుపు దగ్గరికి వేసి నవ్వేడు. మంచం దగ్గరికి వచ్చి నన్ను సుతారంగా జరిపి పక్కన చేరాడు.

ఏ మంచాన్ని ముట్టుకోవటానికి కూడా అసహ్యపడ్డాడో ఆ మంచమూ దుప్పటీ అవసరాన్ని తీర్చాయి. "డైరీలో వ్రాసుకోవటానికి చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ కదూ" అన్నాడు కన్ను కొట్టి. నేను మాట్లాడలేదు. కుక్కి మంచం అవటంతో కదలటానికి కూడా వీల్లేకపోయింది.




## ఫలితం?

"మొన్న ఇంటర్వ్యూ కెళ్ళావుగా. ఆ ఉద్యోగం ఎవరికిచ్చారనుకుంటున్నావ్?" అడిగాడు రవి.

"ఆ. ఏ పరమ నీచనికృష్టుడికో రికమండేషన్ తెచ్చిన వెధవకో ఇచ్చుంటారు" అన్నాడు హరి.

"నీకే ఇచ్చారా ఉద్యోగం" చెప్పాడు రవి.

—పద్మశ్రీ (మాణిక్యారం)




## ఇక భయంలేదు

బాక్స్ ఆఫీస్ హిట్‌లు కావడంతో హిందీ చిత్రనిర్మాతలు టీవీ సీరియల్స్ భయం నుండి బయటపడి సినిమాలు తీస్తున్నారు. యాద్‌గార్, క్షత్రియ, హమ్లా, విశ్వాత్మావంటి హిందీ చిత్రాలు నిర్మించిన బొంబే నిర్మాతలు తమ సినిమాలు హిట్టైనా అవుతాయని, వీడియో, కేబుల్ టీవీల బెడద తమను బాధించదని అనుకుంటున్నారు. దేన్నైనా ప్రేక్షకులు మెచ్చి పోషించినంతకాలం దిగులే వుండదు కదా!

ఇటీవల అకాయ్, లంహే ...

—పాతూరి





పదవిపోయింది

"మీ పిచ్చి పూర్తిగా నయమయింది. మీరిక ఆనందంగా ఇంటికి వెళ్ళవచ్చు" అన్నాడు డాక్టర్.

"ఎలా వెళ్ళను డాక్టర్! నిన్నటి దాకా నేనీ దేశానికి ప్రధాన మంత్రిని. ఇప్పుడా పదవి పోయింది. ఇంటికెళ్ళి ఏం చేయాలి?" వాపోయాడు మాజీ పేషెంటు.

—వి.ఎస్.రామకృష్ణ (విజయవాడ)

బయట్నుంచి దగ్గు వినపడుతూంది. థామస్ నా పక్కనే నిద్రపోతున్నాడు. అప్పటివరకూ వున్న చిరాకు పోయినట్టుంది.

నేను లేచి బయటకొచ్చాను. ఒకవైపు చలి — దానికితోడు వర్షం.

గోదారి గాలి సూదులు గుచ్చుతున్నట్టు వుంది.

మా షెడ్డు పైకప్పు కాస్త ముందుకొస్తే, దానికి ఒక పక్క మరో రేకు అడ్డుపెట్టారు. ఆ క్రింద — పచ్చగడ్డి మీద మూడంకెవేసి పడుకుని దగ్గుతున్నాడు ఆ వృద్ధుడు. నా కళ్లల్లో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి. 'లోపలికి రా' అన్నాడు. అతను కళ్ళు విప్పి, నన్ను చూసి దిగ్గున లేచి కూర్చుని ఏదో చెప్పబోయాడు. 'లోపలికి రా' — అన్నాను క్లుప్తంగా. అతను లేస్తూ వుండగా లోపల ఏదో పడిన చప్పుడు...

ఇద్దరం కంగారుగా లోపలికి వెళ్ళాం.

థామస్ కాళ్ళు మంచానికేసి కొట్టుకుంటున్నాడు. మొదటిసారి నేనతన్ని అలా చూడటం. ..

రామకృష్ణాపురం బీచ్‌లో రెండు సంవత్సరాలు ఏ సాయంత్రమూ రాని ఫిట్స్ — మొదటిసారి వచ్చి, నన్ను కలవరపెట్టాయి. ప్రతి సాయంత్రమూ నీట్‌గా తయారయి వచ్చే థామస్ ఇప్పుడు.

రామయ్య అతని నోరు చుట్టు శుభ్రంగా తుడిచి, ఒక మూలనుంచి ఏదో తీసి ముక్కు దగ్గిర పిండాడు. నాతో 'కంగారు పడొద్దు' అన్నాడు. నేనేం కంగారు పడటం లేదు. మానాన్నగారు డాక్టరు. ఇవన్నీ మామూలే. నేను ఆలోచిస్తున్నది — థామస్ ఈ విషయం నాకు ఎందుకు చెప్పలేదా? అని. నా కెందుకో విశాఖపట్టణం బీచ్‌లో మేము గడిపిన అందమైన సాయంత్రాలు గుర్తొచ్చాయి. మేము మా అందమైన మొహాల్ని (బెటర్ సైడ్ ఆఫ్ ది ఫేస్) చూపించుకుంటూ వచ్చాం ఇన్నాళ్లూ.

రామయ్య రసం పిండి, మిగతాది విసిరేస్తూ ండగా చూసాను. ఉల్లిపాయ... ఫిట్స్‌కి అది చాలా మంచిదని అతను చెప్పాడు. వెంటనే ఉపశమనమిస్తుందట.

* * *

ఆ మరుసటి రోజు ప్రొద్దున్న థామస్ చాలా రిలాక్సింగ్‌గా కనబడ్డాడు. బహుశ ఫెళ్ళున ఎండకాయటం వల్లనేమో.

బయట ఇంకా నీళ్ళు అలానే వున్నాయి. దూరంగా ఒక చిన్న బ్రిడ్జి చూపించి, అది పూర్తిగా కనబడితే నీళ్ళు తగ్గిపోయినట్టే, మేము వెళ్ళిపోవచ్చు అని చెప్పాడు రామయ్య. మాకు ఆ వర్రీ ఇక లేదు. రాత్రి చీకటి — వర్షం అవటంతో భయపడ్డాము గానీ, ఆ దృశ్యం మనోహరంగా వుంది. నేను కారులోంచి బ్రెడ్డు, అరటిపళ్ళు తెచ్చాను.

"కోడిగుడ్లు దొరుకుతాయా?" థామస్ అడిగాడు.

చుట్టూ నీళ్ళు — మధ్య కొండమీద మేము. ఈ పరిస్థితుల్లో ఆ అసందర్భమైన కోరికేమిటి అని అడిగాను. బ్రెడ్‌లోకి ఆమ్లెట్ బావుంటుందని జవాబు ఇచ్చాడు. రామయ్య తెస్తానని చెప్పి లేచాడు. పక్కవూళ్ళో దొరుకుతాయట. మమ్మల్ని సంతోషపెట్టడమే అతనికి బాగా సంతోషాన్నిస్తూందని తెలుస్తోంది.

రామయ్య బయటికి వెళ్ళగానే థామస్ తిరిగి తలుపు వేశాడు. వొద్దన్నాను. నవ్వి 'చుట్టూ నీళ్ళు — దూరంగా పాపికొండలు — మళ్ళీ ఇలాటి అనుభవం రాదు' అన్నాడు. గుడ్లకోసం పంపటం అనేది కూడా ఒక నెపం అని అర్థమైంది.

రామయ్య రావటానికి రెండు గంటలు పట్టేంది. నడుము వరకూ వస్త్రం ఎగ్గట్టి, మొలలోతు నీళ్ళలో రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లొచ్చి గుడ్లు తీసుకొచ్చాడు. ఇంకో పొట్లాం కూడా వుంది అతని చేతిలో. ఏమిటని అడిగాడు.

'విప్ప పూలు అమ్మా' ఇక్కడ ప్రసిద్ధి. నా గుర్తుగా వుంచండి' అన్నాడు.

థామస్ ఈ లోపులో పొయ్యి ముందు కూర్చుని ఆమ్లెట్లు వేయటం మొదలుపెట్టాడు. రామయ్య గిన్నెలే వాడటం చూసి నవ్వుతూ "ఇదికూడా మనం డైరీలో వ్రాసుకోవాలి థామస్" అన్నాను. ఇద్దరం బ్రెడ్—ఆమ్లెట్ తిని, కొంచెం బ్రెడ్ మిగిలితే





తిరిగొచ్చిన ప్రాణ్

హిందీ చిత్రాల విలన్, కారెక్టర్ యాక్టర్ అయిన ప్రాణ్ చాలా సంవత్సరాలు నటించలేదు. ఇటీవలే తిరిగి నటించడం మొదలుపెట్టాడు. తన కొడుకు సునీల్ డైరెక్టర్‌గా, తను కో-ప్రొడ్యూసర్‌గా 'లక్ష్మణరేఖ' సినిమాతీశాడు. అతను నటించిన 'సనం బేవఫా' సక్సెస్‌ఫుల్ కావడం అతనికి మంచి లీడ్ వచ్చింది. దోహంసోకాజోడా, ధర్మ్, ఇసీకా నాం జిందగీ, మషూక్ మొదలైన సినిమాలు ఇంకా రిలీజ్ కావాలి.

—ప్రాతూరి

రామయ్యకిచ్చాం.

రామయ్య చెప్పింది నిజమే. గోదారి నీరు చాలా తొందరగా తగ్గిపోతోంది.

థామస్ బయట ఫోటోలు తీస్తున్నాడు. మా ఆల్బమ్‌లో రహస్యంగా పెట్టుకుని నవ్వుకోవటానికి, ఆ కుక్కి మంచాన్ని కూడా ఫోటో తీశాడు. చాలా హుషారుగా వున్నాడు.

బాగా లేనిది రామయ్యే. మా అతిథి మర్యాదలు చూడటంలో బాగా నలిగిపోయాడు అతడు. రాత్రి బయటపడలేక, ప్రొద్దున్నే నీళ్ళల్లో నడక ఆ వృద్ధుడిని తిరిగి ఉబ్బసానికి గురిచేసాయి. ఛాతీ ఎగిరి ఎగిరి పడుతోంది.

"దగ్గర్లో డాక్టర్లు ఎవరూ లేరా?" అని అడిగాను. లేరన్నాడు. అయినా ఇది తనకి అలవాటే అనీ, కంగారు పడే అవసరం లేదనీ అన్నాడు.

ఇంతలో థామస్ హడావుడిగా లోపలికి వచ్చి "నీళ్ళు తగ్గిపోయాయి పద" అన్నాడు.

కిటికీలోంచి ఆ విషయం స్పష్టంగా తెలుస్తోంది. థామస్ వంగి క్యారియర్ గిన్నెలు గబగబా సర్దుతున్నాడు. "ఏమిటింత హడావుడి" అని అడిగాను.

"మనం వెంటనే హైదరాబాద్ వెళ్తే — మరో గంటలో గోవా వెళ్ళే విమానం వుంది. రాత్రికల్లా గోవాలో వుండొచ్చు" అన్నాడు.

"లేకపోతే హైదరాబాద్‌లో వుంటాం. అంటే. రాత్రి ఎక్కడికీ పోదుగా" అన్నాను.

అతను నుదురు చిట్లించి, "ఏమిటి నీ వుద్దేశ్యం" అన్నాడు. మా సంభాషణ ఇంగ్లీషులో జరుగుతోంది. నేనన్నాను "చూడు థామస్ ఇతను లేచే స్థితిలో లేడు. మనకి ఇన్ని మర్యాదలు చేశాడు. ఇతనికి కాస్త అన్నం వండిపెట్టి వెళ్దాం."

థామస్‌లో అలాటి ఎక్స్‌ప్రెషన్ నేనెప్పుడూ చూడలేదు. నేను నిజంగా మతివుండే మాట్లాడుతున్నానా అన్నట్టు కళ్ళు పెద్దవి చేసి చూశాడు. తరువాత "పద. వంటా లేదు, స్నానం లేదు" అన్నాడు. తరువాత జేబులోంచి పర్సు తీసి ఓ యాభై నోటు తీసి తాత తల దగ్గర పెడుతూ "వుంచు ఈ డబ్బు. థాంక్యూ. వెళ్లొస్తాం" అని నన్ను తీసుకొచ్చి కారు ఎక్కించాడు.

కారు రివర్సు చేస్తూ అన్నాడు "అతనికి వంట చేస్తావా? ఇంకా నయం. అతను భోజనం చేసే వరకూ వుందాం. అన్నావ్ కాదు" ఆ ఉబ్బసం రెండ్రోజుల వరకూ తగ్గకపోతే రెండ్రోజులు ఇక్కడే వుంటావా?"

నేను మాట్లాడలేదు.

కారు గుట్ట దిగుతోంది. "ఎవర్నెక్కడుంచాలో అక్కడ వుంచాలి. అసలు మనకి ఆతిథ్యం ఇవ్వడమే వాడి జీవితంలో ఒక గొప్ప వరం..." నవ్వేడు. "నీవాలకం చూస్తుంటే నేనిలా బలవంతంగా లాక్కొని రాకపోయివుంటే డాక్టర్‌ని పిలిచి ట్రీట్‌మెంట్ కూడా ఇప్పించి వుండే దానివేమో కదా!"

కారు మెయిన్‌రోడ్డు మీదకు వస్తుండగా లీలగా "బాబుగారూ — బాబుగారూ" అని వినబడటంతో తలతిప్పి చూశాడు. రామయ్య గుట్ట క్రిందకి పరుగెత్తుకు వస్తున్నాడు. ఉబ్బసం మీద ఊపిరాడక కష్టపడుతూ, అంత కష్టంలోనూ ఎలాగో వీలు చూసుకుని మాట్లాడగలిగాడు "బాబుగారికి మధ్యలో ఎక్కడయినా



## అనుమానం

"ఏమిటిసార్... ఒకటే బాధపడిపోతున్నారు?" అడిగాడు గుర్నాధం.

"లేకపోతే ఏమిటండీ... పనిమనిషితో మార్కెట్‌కి పోతే అనుమానం. గర్ల్‌ఫ్రెండ్‌తో సినిమాకు వెళ్తే అనుమానం. లేడీ టైపిస్ట్‌తో టూర్ వెళ్తే అనుమానం. ఇలా ప్రతిదానికి అనుమానపడే భార్యతో ఎలా కాపురం చేయాలో అర్థం కావటం లేదు" వాపోయాడు మన్మధరావు.

—పద్మశ్రీ (మాణిక్యారం)


ఫిట్సొస్తయేమో. ఇది వుంచండి" అని నా చేతిలో పెట్టాడు ఉల్లిపాయ.

నేనేదో అనబోయేటంతలో థామస్ ఒక్క జెర్కులో కారు ముందుకు కదిలించాడు. వెనుక రామయ్య రొప్పుతూ నిలబడి వున్నాడు.

థామస్ నా చేతిలోంచి దాన్ని తీసుకుంటూ "నేనేమన్నా క్రానిక్ ఫిట్స్ పేషెంట్‌ననుకుంటున్నాడా ఇడియెట్" అంటూ విసురుగా బయటకు విసిరేసేడు. రోడ్డు పక్కనున్న పెద్ద బండరాయికి తగిలి, అది పారలు పారలుగా విడిపోయింది.

నా మనసులాగా.

*



## డాక్టరైన చాణక్య

టీవి సీరియల్ 'చాణక్య' పాత్రధారి, డైరెక్టర్ అయిన చంద్రప్రకాశ్ ద్వివేది ఎంబిబిఎస్ పాసైన డాక్టర్ చంద్రప్రకాష్ తండ్రి సంస్కృత ఉపాధ్యాయుడు కావడంవలన, అతని చాణక్య 'అర్థశాస్త్రం'మీద సంపూర్ణ అథారిటీ వచ్చిందంటారు కొందరు.

1987నుండి దూరదర్శన్ చుట్టూ తిరిగి సంపాదించుకున్న చాణక్య సీరియల్‌కి, ఇది బిజెపివారిదని, చంద్రప్రకాశ్ చైనావారి ఏజెంట్ అని అపవాదులు వచ్చాయి. కాని తాను పూర్తి దేశభక్తుణ్ణని, ఏ పార్టీకి చెందనివాడినని చంద్రప్రకాశ్ వాదిస్తున్నాడు.

—ప్రాతూరి

